అపురూప అవార్డుల ప్రదానం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో అమృతలత–అపురూప అవార్డ్స్–2024 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్యం, వైద్య రంగంలో కృషి చేసిన డాక్టర్ కేవీ కృష్ణకుమారి, డాక్టర్ ఆలూరి విజయలక్ష్మికి అమృతలత జీవన సాఫల్య పురస్కారాలతో పాటు ఒక్కొక్కరికి రూ.25 వేలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే జీఎస్.లక్ష్మి (కథా రచన), ప్రొఫెసర్ సీహెచ్.సుశీలమ్మ (సాహిత్య విమర్శ), శివలక్ష్మి (సినీ విశ్లేషణ), సావేరి దుర్గా భవానీ (రంగస్థలం), సమతా రోష్ని (సామాజిక సేవ), నందూరి సుందరీ నాగమణి (పద్య రచన), డాక్టర్ కొండపల్లి నిహారిణి (అంతర్జాల పత్రిక సంపాదకత్వం, జ్యోతిర్మయి మళ్ల (సంగీతం–గజల్), అంజనీ యలమంచిలి(షార్ట్ ఫిల్మ్స్), గీతా హజారే (నృత్యం), ప్రేమమాలిని (జర్నలిజం–ఎలక్ట్రానిక్ మీడియా)దేవనపల్లి వీణావాణి(కవిత్వం) అపురూప అవార్డులతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరై పురస్కార గ్రహీతలను అభినందించారు. అలాగే అతిథులు, అవార్డు గ్రహీతలకు సంబంధించిన పరిచయాలతో కూడిన 'అభినందన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహిత్యం, ఇతర లలిత కళలకు దూరమవుతున్న యువతరానికి వాటిపై ఆసక్తి, అలాగే ఆయా రంగాల్లో విశేషంగా కృషి చేసిన వారిని గౌరవించాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అవార్డుల వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య అలేఖ్య పుంజాల, ప్రముఖ సినీ నటి తులసి పాల్గొన్నారు. రచయిత్రి నెల్లుట్ల రమాదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సాహిత్యంలో నిష్పాక్షిక విమర్శ పెరగాలి


శిబిరంలో ప్రసంగిస్తున్న వక్తలు

సుల్తాన్‌బజార్: తెలుగు సాహిత్య విమర్శలో నిష్పాక్షమైన విశ్లేషణ పెరగాలని వక్తలు పేర్కొన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత్ పరిషత్ కళామందిరంలో సాహిత్య విమర్శ అధ్యాయన శిబిరం ఆదివారం జరిగింది. తెలంగాణ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు విమర్శకులు పాల్గొని వివిధ అంశాలపై ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రాచీన కాలం నుంచి తెలుగు భాష, సాహిత్య పరిణామ వికాసాల్లో సాహిత్య విమర్శ ఎంతో ప్రాధాన్యం వహించిందన్నారు. ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య ఎస్వీ రామారావు ప్రధానోపాన్యాసం చేస్తూ 1875 వ సంవత్సరంలో కందుకూరి వీరేశలింగం రచించిన విగ్రహ తంత్ర మిమర్శనం అనేది మొట్టమొదటి విమర్శ గ్రంథమన్నారు. ప్రాచీన సాహిత్యంలో విమర్శ పలు రూపాల్లో ఉందని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మాసన చెన్నప్ప వివరించారు. విమర్శ, వ్యాఖ్యానం, సమీక్ష, సాహిత్య చరిత్ర పరిశోధనల మధ్య వేద సాదృశ్యాలపై తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ సి.మృణాళిని, డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.

మజ్లిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, మాజీ ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీ

గోల్కొండ: కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆధ్వర్యంలో టోలిచౌకీ హకీంపేట్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే, జాతీయ ప్రధాన కార్యదర్శి అహ్మద్‌పాషాఖాద్రీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి నెలకొనాలని, పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ విజయం సాధించాలని ప్రార్థనలు చేశామన్నారు. ఆల్ ఇండియా కిరత్ కమిటీ అధ్యక్షుడు, కుతుబ్ షాహీ ఈద్గా ఖతీబ్ మౌలానా కారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మన దేశం చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్‌పటాన్ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వైపరీత్యాలను అరికట్టాలి


కార్యక్రమంలో డాక్టర్ ఉమర్ అలీషా తదితరులు

అబిడ్స్: ప్రకృతి వైపరీత్యాలను అరికట్టాలంటే మొక్కలు నాటాలని సద్గురు వర్యులు డాక్టర్ ఉమర్ అలీషా సూచించారు. నవమి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా సద్గురువర్యుల ఆధ్వర్యంలో హైదరాబాద్ శాఖ ఏర్పాటు చేసిన శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం యొక్క వైశాఖ మాస పర్యటన సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్సవ్, రిటైర్డ్ డిస్ట్రిక్ జడ్జి నాగ మారుతీ శర్మ, గిడుగు రామ్మూర్తి ఫౌండేషన్ ప్రెసిడెంట్ వేమూరి లక్ష్మి, రిటైర్డ్ ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ రామావతారం హిందూ డైలీ ఎడిటర్ సందేశ్ భారద్వజ్, రిటైర్డ్ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులతో పాటు పీఠం యొక్క ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారత దేశ విశిష్టతను భావితరాలకు అందించాలని, ధర్మాన్ని పాటిస్తూ ఆధ్యాత్మికతలో ప్రతిఒక్కరూ జీవించాలని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శ్రీవత్సవ్ కోరారు.



సమ్మేళనంలో పాల్గొన్న భారత అభ్యుదయ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ రిపబ్లిక్ హైస్కూల్ 1990 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఛత్రినాకలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ప్రస్తుత తమ స్థితిగతులను పంచుకున్నారు. అలాగే నాటి ఉపాధ్యాయులు ఉమ, పరమేశ్వర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రవీందర్, కుమార్, ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్, లావణ్య, భాగ్య, రజనీ పాల్గొన్నారు.

భారత అభ్యుదయ హైస్కూల్ ..

బహదూర్‌పురా: జియాగూడలోని భారత అభ్యుదయ హైస్కూల్ 1995–96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 28 సంవత్సరాల తర్వాత ఆత్మీయ పలకరింపులతో పులకించిపోయారు. అలాగే పాఠశాల లోగోతో ప్రత్యేక మెమొంటోను అందించుకుంటూ జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. సమ్మేళనంలో మనోజ్ , రామస్వామి, ప్రభాకర్, గజానంద్, ఆనంద్, సునీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రిపబ్లిక్ పాఠశాల గురువులను సత్కరిస్తున్న 1990 బ్యాచ్ విద్యార్థులు

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్‌దే విజయం


పద్మారావు గౌడ్‌ను సత్కరిస్తున్న సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్‌దే విజయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నాంపల్లి నియోజకవర్గంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రదీప్ కుమార్ ఆయనను సత్కరించారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయంలో ఒక్కరోజు కూడా కరెంట్ సరఫరాలో అంతరాయం కలగలేదన్నారు. కానీ ప్రస్తుతం కరెంట్, తాగునీటి సమస్యలతో ప్రజలు నరకయాత్ర అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతబస్తీ జ్యువెలరీస్‌కు ట్రాఫిక్ దెబ్బ..!

- అసలే ఇరుకు రోడ్లు.. ఆపై వాహనాల రద్దీ
- షాపుల ముందు పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు
- కొనుగోళ్లకు ముందుకురాని వినియోగదారులు
- గిరాకీ లేక వెలవెలబోతున్న షాపులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, కార్మికులు


గిరాకీ లేక వెలవెలబోతున్న పాతబస్తీలోని ఓ బంగారం దుకాణం

చార్మినార్: పాతబస్తీలోని బంగారు, వెండి, ముత్యాల వ్యాపారులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు పార్కింగ్ సమస్యలతో సతమతమవుతుండగా, మరోవైపు ఇటీవల అనూహ్యంగా పెరుగుతున్న బంగారం ధరలు వారికి చుక్కలు చూపిస్తున్నాయి. 24 క్యారెట్ల తులం (10 గ్రాముల) బంగారం ధర దాదాపు రూ.74 వేలకు పైగా ఉంది. దీంతో గిరాకీ తగ్గి షాపులు వెలవెలబోతున్నాయి. ఇదిలావుంటే పాతబస్తీలో పార్కింగ్ సమస్య, ట్రాఫిక్ రద్దీ వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయి. మరోవైపు తమ దుకాణాల వరకు భారీ వాహనాలు వచ్చే అవకాశం లేకపోవడం.. ఇటు చిరు వ్యాపారులు తమ షాపుల ఎదుట అక్రమంగా వ్యాపారాలు చేసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులు అనుమతించడంతో తమ షాపులు కనిపించక రోజురోజుకు తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని బంగారం వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాభివృద్ధికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుంటే రానున్న రోజుల్లో పాతబస్తీలో బంగారం, వెండి వ్యాపారాలు కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిజాం కాలం నుంచి..

ఒకప్పుడు బంగారం, వెండి, ముత్యాల విక్రయాలకు పాతబస్తీ ప్రధాన వ్యాపార కేంద్రం. నిజాం కాలం నుంచి ఇక్కడ బంగారు ఆభరణాల క్రయవిక్రయాలకు ఆదరణ ఉంది. అయితే కొంతకాలంగా వ్యాపారాలు తగ్గుముఖం పడుతున్నాయి. దాదాపు 200 వరకు దుకాణాలున్న పాతబస్తీలో వినియోగదారులకు పార్కింగ్ సౌకర్యంతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లేకపోవడంతో ఒకప్పటి వ్యాపారాలు ఇప్పుడు కనిపించడం లేదు. చార్మినార్‌కు వచ్చే పర్యాటకులకు చార్‌కమాన్‌లోని నగల దుకాణాలే ముందుగా దర్శనమిస్తాయి. పాతబస్తీ సంస్కృతి, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టేలా ఇక్కడి బంగారు, వెండి, ముత్యాల నగల దుకాణాలు ప్రసిద్ధి చెందాయి.

ఆర్థిక ఇబ్బందుల్లో వలస కార్మికులు..

జువెల్లరీ షాపుల్లో గిరాకీ లేకపోవడంతో ఆ ప్రభావం బంగారు, వెండి ఆభరణాలు తయారు చేసే వలస కార్మికులపై పడుతోంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చిన ఎంతో మంది యువకులు బెంగాలీలు గుల్జార్‌హౌజ్, కోకర్‌వాడీ, మామాజుమ్లా పాటక్, మూసాబౌలి, ఘాన్సీబజార్, జూలా, బండికా అడ్డా తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న ఖార్ఖానాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఆర్డర్లపై నగలు తయారు చేసి ఆయా దుకాణాల్లో అప్పగించి ఉపాధి పొందుతున్నారు. అయితే ప్రస్తుతం గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీ..తప్పని ట్రాఫిక్ తిప్పలు..

నగరంలో ప్రథమంగా నగల దుకాణాలు చార్‌కమాన్‌లోనే ప్రారంభమయ్యాయని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు. దాదాపు 200కు పైగా ఉన్న ఇక్కడి దుకాణాలు ప్రతిరోజు కష్టమర్లకు తమ సేవలు అందిస్తున్నాయి. పాతబస్తీని సందర్శించడానికి వచ్చే పర్యాటకులే కాకుండా నగర శివారు జిల్లాల వినియోగదారులు కూడా చార్‌కమాన్‌లోని జువెల్లరీ షాపులకు వచ్చి తమకు అవసరమైన ఆభరణాలు కొనుగోలు చేస్తుండేవారు. ప్రస్తుతం ఇక్కడి వ్యాపార పరిస్థితులు గతం కంటే భిన్నంగా తయారయ్యాయి. వినియోగదారులు వచ్చేందుకు సరైన మార్గాలు లేకపోవడంతో గిరాకీ పూర్తిగా తగ్గిపోయిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి బంగారం, వెండి ఆభరణాల వ్యాపారాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

పార్కింగ్ లేక ఇబ్బందులు..



షాపుల ముందు సరైనా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో పాటు నిత్యం ట్రాఫిక్ రద్దీతో వ్యాపారులతో పాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాతబస్తీలోని వ్యాపారులు తమ దుకాణాలను నగరంలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ బ్రాంచ్‌లను నామమాత్రంగా కొనసాగిస్తూనే నగరంలో మరో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

– నాగ్‌నాథ్ మాశెట్టి, భవానీ జ్యువెలరీ, గుల్జార్‌హౌజ్

నేడు ఎస్పీ శైలజకు పురస్కారం ప్రదానం

గన్‌ఫౌండ్రీ: రవీంద్ర భారతీలో ఈ నెల 20న (నేడు) ప్రముఖ సినీ నేపథ్య గాయనీ ఎస్పీ శైలజకు సంగీత దర్శకుడు కె.చక్రవర్తి జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన సుస్వర వాహిని కళా సంస్థ అధ్యక్షుడు అమీన్ పాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు మురళీమోహన్, దర్శకుడు మాధవపెద్ది సురేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అలాగే సినీ నేపథ్యం గాయనీ గాయకులతో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి



గన్‌ఫౌండ్రీ: భారత ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో అన్నమాచార్య జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా హాజరై మాట్లాడుతూ.. తాళ్లపాక అన్నమాచార్యులు గొప్ప వాగ్గేయకారులని కొనియాడారు. సుమారు 30 వేల కీర్తనలు ఆలపించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం పలువురు నాట్య గురువులకు అభినవ నర్తకి, నాట్య కౌస్తుభ, గాన శిఖరం అవార్డులు అందజేశారు. అంతకుముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సినీ నటుడు నరేశ్, డాక్టర్ పద్మిని, నృత్య గురువు పసుమర్తి వేషబాబు, సంస్థ అధ్యక్షురాలు లయన్ లలితరావు పాల్గొన్నారు.

నేటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్

శంషాబాద్: పట్టణంలోని మినీస్టేడియంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హిమబిందు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 20 నుంచి 30 వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దోస్త్ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజేంద్రనగర్ అని ఉంటుందన్నారు. బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు 9441956233, 9494812040 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని భారత రత్న కర్పూరి ఠాకూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కన్వీనర్ సూర్య నారాయణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని కోరుతూ సీఎం కలుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జడ్జి టి.గోపాల్ సింగ్ చేతుల మీదుగా ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్ దంపతులు, ప్రమోషన్ పొందిన ఏసీపీ సురేశ్, వినోద్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ప్రభాకర్, మురళీమోహన్, లక్ష్మణ్‌రావు, భవాని శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక


అధ్యక్షుడు అనంతోజ్ రాజేశ్వర్ రాజ్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: చారిత్రాత్మకమైన హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడిగా అనంతోజ్ రాజేశ్వర్ రాజ్ (రాజేభాయ్) ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గతంలో ఆలయం తరఫున భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే యేటా ఆషాఢ మాసం బోనాల జాతరలోనూ పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సిరిగిరి పాపయ్య, నోముల ప్రకాశ్ యాదవ్, ధనుంజయ్ ముదిరాజ్, ప్రవీణ్‌కుమార్ గౌడ్, మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, దిలీప్, బుల్లెట్ శ్రీధర్ తదితరులు పాల్గొని ఆయనకు పూల మాల వేసి సత్కరించారు.

సేవక్‌నగర్‌లో భగ్గుమన్న పాత కక్షలు

రెండు గ్రూపుల అనుచరుల మధ్య ఘర్షణ

నాంపల్లి: హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సేవక్‌నగర్‌లో పాత కక్షలు భగ్గుమన్నాయి. ఈ దాడుల్లో ఇద్దరు గాయపడగా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న రాత్రి సేవక్‌నగర్ బస్తీలోని వేర్వేరు ఇండ్లలో శుభ, అశుభ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు. అదే సమయంలో స్థానికంగా ఉండే మాజీ రౌడీషీటర్ మహ్మద్ సమీర్, అదే బస్తీకి చెందిన యువకుడు, ఓ ప్రధాన రౌడీ షీటర్ అనుచరుడు ఇర్ఫాన్ దబ్రాల మధ్య ఆధిపత్యం, మామూళ్ల విషయంలో ఘర్షణ తలెత్తింది. ఇద్దరి అనుచరులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. స్థానికులు గమనించి హబీబ్‌నగర్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని రెండు గ్రూపులను చెదరగొట్టి8 మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పరారు కాగా వారిని పట్టుకునే పనిలో పోలీసులు ఉన్నారు. అరెస్టు అయిన ఓ గ్రూపులో నవీద్ అతడి అన్నదమ్ములు మహ్మద్ ఇర్ఫాన్, సయ్యద్ వసీం, సయ్యద్ మాజీద్ (రౌడీషీటర్), మరో గ్రూపులో సమీర్ (మాజీ రౌడీషీటర్), హుస్సేన్ షరీఫ్, వాజీద్, ఫిరోజ్ ఉన్నారు. ఈ గొడవ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆదివారం సౌత్ వెస్ట్ అడిషనల్ డీసీపీ మహ్మద్ అస్ఫాక్ హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు.

26న ఉచిత వైద్య శిబిరం


కరపత్రాలు విడుదల చేస్తున్న ఆకుల శ్రీరాములు

చార్మినార్: పాత నగర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉచిత మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంప్‌తో పాటు ఐ శిబిరం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీరాములు తెలిపారు. ఆదివారం ఉదయం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిమ్స్, సన్‌షైన్ ఆసుపత్రుల సహకారంతో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉప్పుగూడ హనుమాన్‌నగర్‌లోని సాయి క్రుప వసంత బంకెట్ హాల్‌లో శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. జనరల్ హెల్త్ చెకప్, కార్డియాలజీ చెకప్, కంటి పరీక్షలు, స్కిన్ కాస్మోటిక్ స్క్రీనింగ్ టెస్ట్, డయాబెటిక్ చెకప్, 2డీ ఏకో, ఈసీజీ, బీపీతో పాటు దంత, బీఎండీ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. అలాగే రెడ్‌క్రాస్ ద్వారా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ రాయల్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బిట్ల హన్స్‌రాజ్, ఉపాధ్యక్షులు దేవరశెట్టి ప్రభాకర్, పల్లె శ్రావణ్, పూస కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి కాసారపు చంద్రకుమార్, కార్యదర్శి కటిక శ్రీధర్, కోశాధికారి మామిడి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య వర్ధంతి


సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గోల్కొండ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం నాయకులు ఆదివారం నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లోని బొజ్జగుట్టలో జరిగిన కార్యక్రమంలో నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాంపల్లి జోన్ కన్వీనర్ సి.మల్లేశ్, శంకర్, ఎం.యాదయ్య, సీహెచ్.వెంకటస్వామి, శ్రీనివాస్, రాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.

నాంచారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి కొమటి వెంకట్‌రెడ్డి

గోల్కొండ: ఈ నెల 23 న జరగనున్న ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే బడ్జెట్‌లో ఎరుకల అభ్యున్నతికి నిధులు కేటాయించాలని సీఎంను కోరుతానని పేర్కొన్నారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుతాడి కుమార్, ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ, జిల్లా నాయకులు, ప్రతినిధులు ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

యాకుత్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తిగల రంగాల్లోనూ రాణించాలని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం. రాజేశ్ యాదవ్ సూచించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన పాతబస్తీకి చెందిన పలువురు క్రీడాకారులు కరిష్మా రాణి షిండే, వైష్ణవి, ఆఖిల్‌రాజ్, పునీత్, ఆర్యాన్‌ను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్ ప్రదీప్, సభ్యులు ఇషాక్ ఖురేషి, విష్ణు వర్ధన్, శశి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి


నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మణిలాల్ షా తదితరులు

అబిడ్స్: గాంధీభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మనిలాల్‌షా సంజీవ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రగతి, అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు.

రిజర్వేషన్ల పెంపు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



అబిడ్స్: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంపీ ఆర్.కృష్ణయ్యతో ఆదివారం సమావేశమై బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు సరైన ప్రాధాన్యత ఇచ్చి చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి పాశం యాదవ్, ఆదిమూలం శంకర్, వెన్ను శివకుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు పర్యాటకుల తాకిడి



గోల్కొండ కోటకు ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సెలవు దినం కావడంతో ఉదయం 8 నుంచే బుకింగ్ కౌంటర్ ముందు బారులుతీరారు. ఎత్తైన కోట గోడలు, వివిధ రకాల భారీ చెట్లు, ఫిరంగుల వద్ద యువ జంటలు సెల్ఫీలు, అలాగే కుటుంబ సభ్యులతో కలిసి రాణి మహల్ వద్ద ఫొటోలు దిగారు. నగీనాబాగ్ ఎగువ భాగంలో గల నాగదేవత పుట్ట వద్ద పూజలు చేశారు. –గోల్కొండ

పాతబస్తీలో సందర్శకుల సందడి

పాతబస్తీలోని చార్మినార్ పరిసరాలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఆదివారం సెలవు కావడంతో పర్యాటకుల పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చిరు వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్‌తో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. –చార్మినార్



నెహ్రూ జూ పార్కు కిటకిట



నెహ్రూ జూ లాజికల్ పార్క్‌కు ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. వేసవి సెలవులను పురస్కరించుకుని జూ అధికారులు అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్లపై కూడా విస్తృత ప్రచారం నిర్వహించారు. దీంతో వేలాదిగా సందర్శకులు వచ్చినప్పటికీ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నట్లు జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ నాగమణి తెలిపారు. –బహదూర్‌పురా

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684